క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి ప్రతిపాదన


ప్లాన్ వివరాలు పరిశీలిస్తున్న విప్

నందిగామ: కూడలి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శనివారం ఆలయానికి వచ్చిన ఆయన ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఆలయం వద్ద రాజగోపుర నిర్మాణానికి రూ.39 లక్షలతో తయారు చేసిన ప్రతిపాదనలను పరిశీలించారు. అదేవిధంగా ఉపనదుల వద్ద స్నానఘాట్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు వచ్చే ఏడాది శివరాత్రి లోగా దాదాపుగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. సమావేశంలో ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, ఆలయ ఈఓ భూపాల్, తనిఖీదారు అనురాధ పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో మైనర్లు డ్రైవింగ్ చేయకుండా తగు చర్యలు తీసుకోవాలంటూ అయోధ్యనగర్‌కు చెందిన జయహో సర్వీసెస్ అండ్ ట్రాఫిక్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీ శనివారం ట్రాఫిక్ ఏసీపీకు వినతి పత్రం అందజేశారు. మైనర్లు డ్రైవింగ్ చేయటం వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు మైనర్లు డ్రైవింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆమె వినతి పత్రంలో కోరారు.

గంజాయి స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్, వాంబే కాలనీ పరిధిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు నగర పోలీసు కమిషనర్‌కు సమాచారం అందిందన్నారు. ఆయన సమాచారం మేరకూ పోలీసులు వాంబేకాలనీ ఎక్సెల్‌ప్లాంట్ వద్ద తనిఖీలు చేపట్టమన్నారు. షేక్ యాకోబ్ షరీఫ్(25) అనే వ్యక్తి ఎక్సెల్‌ప్లాంట్ వెంబడి నూతనంగా నిర్మించిన జీప్లస్‌త్రీ నివాసాల వద్ద అనుమానస్పదంగా కనిపించాడని చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకొని పోలీసులు తనిఖీలు చేయగా అతగాడి వద్ద రెండు కేజీల గంజాయి లభించిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టు ఎదుట హాజరుపరచగా కోర్టు అతనికి రిమాండ్ విధించింది.

21న భవానీద్వీపంలో మాతృభాషా దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు, సంస్కృత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో భవానీ ద్వీపం నందు హంపి థియేటర్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం వ్యవస్థాపకులు పీవీఎల్ఎన్ రాజు(అబ్బు) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈ వేడుకల్లో భాగంగా శాసన పరిశోధకులు, చారిత్రక రచయితలను సత్కరించనున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు జాతీయులు, తెలుగు భాషాభిమానులు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్టెల్లాలో ఎన్‌సీసీ ప్రాక్టికల్స్

పటమట(విజయవాడతూర్పు): స్టెల్లాలో ఎన్‌సీసీ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు నగరానికి చెందిన వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు డ్రిల్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్ పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలకు ప్రిసీడింగ్ అధికారులుగా లెఫ్టినెంట్ కర్నల్ తన్వీర్, కర్నల్ సౌరభ్ ముఖర్జి, కర్నల్ సురేంద్రన్ వ్యవహరించారు. ఎన్‌సీసీ 4 ఆంధ్ర గరల్స్, 17 ఆంధ్రాబెటాలియన్, 1ఈఎంఈ బెటాలియన్ (ఎలక్ట్రానిక్-మెకానికల్ ఇంజినీరింగ్‌కు చెందిన) సుమారు 500 మంది కేడెట్లు పరీక్షలను ఎదుర్కొన్నారు. ఈ పరీక్షలను ఆడమ్ ఆఫీసర్ కనకలత, జూనియర్ కమిషన్డ్ అధికారి మనోహరరెడ్డి, లెఫ్టినెంట్ రోహిణి, కుసుమ, పీబీ సిద్దార్థ, కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎస్‌కె రఫియ, నలంద కళాశాల ఎన్‌సీసీ యూనిట్లు పాల్గొన్నారు.

బొమ్మరిల్లు కవితా సంపుటి ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయకుమార్ ఛాయాచిత్రలతో కూడిన బొమ్మరిల్లు కవితా సంపుటిని కృష్ణవేణీ నదీ తీరాన శనివారం గాంధీ దేశం ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆర్ ఆర్ నాగరాజన్ గాంధీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కవితా సంపుటిలో అరుదైన ఛాయాచిత్రలతో పాటు వాటికి సంబంధించిన కవితాంశం ఉందని కవి విజయకుమార్ అనేక సామాజిక అంశాలను ప్రస్తావించారన్నారు.

హర హర మహాదేవ శంభో శంకర

మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. అన్ని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పలు ఆలయాల్లో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


లింగాల మునేటి వద్ద జల్లు స్నానాలు చేస్తున్న భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీస్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామునుంచి భక్తులు మధ్యాహ్నం వరకు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. మునేరు పక్కన ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి, గ్రామంలోని అంబికేశ్వరస్వామి, నవాబుపేటలోని శ్రీఅన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, అనిగండ్లపాడులోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకాలు, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెనుగంచిప్రోలు జమ్మిచెట్టు రామాలయంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ పీటలపై విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు నంచర్ల గోపాచార్యులు దంపతులు కూర్చొన్నారు.

వత్సవాయిలో..

వత్సవాయి: లింగాలలోని రామలింగేశ్వరస్వామి, మక్కపేటలోని రామలింగేశ్వర, ద్వాదశజ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయం. భీమవరంలోని కోనగిరి మల్లికార్జునస్వామి, ఇందుగపల్లిలోని శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయాలను శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నదీ, మునేరు స్నానాలు చేసుకుని పెద్దలకు పిండప్రదానం కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. లింగాల మునేటివద్ద జల్లు స్నానాలు ఏర్పాటుచేశారు. లింగాల, ఇందుగపల్లి ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కోనగిరి మల్లికార్జునస్వామి గట్టుపైకి భక్తులు చేరుకునేందుకు రామ్‌కో సిమెంట్ వారు ప్రత్యేక బస్సును ఏర్పాటుచేసి భక్తులకు అల్పాహారంగా పులిహోరను అందించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వరనగర్‌లో గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి శాంతి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా మహాశివరాత్రి నాడు లోక శాంతి కోసం స్వామి శాంతి కల్యాణం నిర్వహిస్తుంటారు. కఅనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

ముక్త్యేశ్వరుని దర్శించుకున్న ప్రముఖులు

భవానీ ముక్తేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలోని భూచవరం ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఉదయభాను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదే విధంగా నందిగామ ఆర్డీఓ రవీంద్ర, కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డీసీపీ మేరి ప్రశాంతి, తదితరులు దర్శించుకున్నారు.

గురుధాంలో..

మండలంలోని బలుసుపాడు గ్రామంలోని గురుధాం ఆశ్రమంలో మహా శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాత్వికుడు గెంటేల వెంకటరమణ దంపతులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: మహా శివరాత్రిని పురస్కరించుకుని శివసాయి క్షేత్రంలో తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకుని విశేష పూజలు చేశారు. స్థానిక పాత శివాలయం, మండలంలోని, గొట్టుముక్కల, మున్నలూరు కృష్ణానదీ తీరాన కొలువైఉన్న సంగమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

శివోహం..

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి సూర్యాస్తమయం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రవిశంకర్ ప్రారంభించారు. స్వామి దర్శనానికి వచ్చిన వీఐపీలకు ఆలయ పాలకవర్గ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, ఈఓ వాసిరెడ్డి భూపాల్, తనిఖీదారు అనురాధలు సన్మానాలు చేశారు.

ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కూడలి సంగమేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు ఉదయభానును సన్మానించారు. ఆయన వెంట కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కామినేని రవిశంకర్, పార్టీ ఏటి పట్టు గ్రామాల కన్వీనర్ దేవినేని రామారావు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో..

నందిగామలో వేంచేసియున్న శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరి కనిపించారు.

చందర్లపాడు మండలంలో..

మండలంలోని కాండ్రపాడులో పంచముఖేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

వీరులపాడులో..

వీరులపాడు: జుజ్జూరు గ్రామంలోని సోమేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు యనమదల ప్రసాద్ శర్మ కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల సమీపంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై సోమేశ్వరరావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పల్లెంపల్లి సమీపంలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో తక్షణమే ఆయన స్పందించి క్రమబద్ధీకరించారు.

చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం (పెద్దశివాలయం)లో స్థానాచార్యులు పిల్లలమర్రి నాగకృష్ణ శర్మ, ప్రధాన అర్చకులు పల్లెకూన కేశవప్రసాద్ ఆధ్వర్యంలో, పాలేటితీరాన ఉన్న అన్నపూర్ణసహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం (మఠం శివాలయం)లో అర్చకులు మంగు సాయిచైతన్య శర్మ ఆధ్వర్యంలో స్వామికి మహన్యాసక పూర్వక రుద్రాభిషేకాలు, మన్యుసూక్త పాశుపత హోమం, అన్నాభిషేకం, రథోత్సవం, శివల్యాణం ఘనంగా నిర్వహించారు.

నాగమయ్య బజార్‌లోని శ్రీభ్రమరాంబ సహిత నాగలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీధర్మశాస్త్ర అయ్యస్వామి ఆలయంలోని మల్లికార్జునస్వామి ఆలయం, చెరువు బజార్‌లోని మార్కండేయ స్వామి ఆలయం, బ్రాహ్మణబజారులోని రాజరాజేశ్వరస్వామి ఆలయం, బంగారుపేటలోని శ్రీయోగీశ్వర ఆలయాలలో ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

అన్నదానాన్ని ప్రారంభించిన ప్రభుత్వవిప్ ఉదయభాను


కొంగరమల్లయ్య గట్టు వద్ద అన్నదానాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డిస్తున్న ఉదయభాను

గట్టు భీమవరం వద్ద కోనగిరి మల్లికార్జున స్వామి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు గుండం రంగారెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రారంభించారు. శివరాత్రి రద్దీని పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై అభిమన్యు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు పాల్గొన్నారు.

తరలివచ్చిన భక్తకోటి


ముక్తేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలో బారులుతీరిన భక్తులు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని భవానీ ముక్తేశ్వరాలయానికి శనివారం మహా శివరాత్రి కావడంతో తెల్లవారుజాము నుంచే ఏపీ, తెలంగాణా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ సమీపంలోని కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసి ముక్తేశ్వరునికి అభిషేకాలు, కుంకుమ, బిళ్వార్చ పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా నది వద్ద ప్రత్యేకంగా గజఈతగాళ్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ నాగరాజు, తహసీల్దార్ నాగరాజు, సీఐ నాగమురళి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిటకిటలాడిన కోటిలింగాల..

కోటిలింగ హరిహర మహా క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.


కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో పంచముఖేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు


పేటలోని మఠం శివాలయంలోని శివలింగానికి అభిషేకాలు


ముక్త్యాలలో ఏర్పాట్లను పరిశీలించిన నందిగామ ఆర్డీఓ


ముక్త్యాలలో పూజలు చేస్తున్న విప్ ఉదయభాను


జుజ్జూరు సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


కంచికచర్ల శివసాయి క్షేత్రంలో శైవాలయంలో పోటెత్తిన భక్తులు


పెనుగంచిప్రోలు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు


కూడలి సంగమేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు


కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను


శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అభివృద్ధికి సహకరించండి

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపాలిటీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు అడగడుగునా ఆటంకాలు కల్పిస్తూ రాజకీయాలు చేయడం సరైంది కాదన్నారు. మహిళా కౌన్సిలర్లు తన్నీరు నాగమణి, దువ్వల రమాదేవి, కో-ఆప్షన్ సభ్యురాలు షేక్ బషీరున్నీసా, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ముసిని రాజ్యలక్ష్మితో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ముందున్న స్థలంలో గ్రీనరీ, వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ వారి అనుమతితో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాలతో నిర్మాణ పనులు మొదలు పెట్టామని తెలిపారు. ఆ పనులన్నీ కూడా మున్సిపాలిటీ నిధులతో సంబంధం లేకుండా దాతల సహకారంతో మాత్రమే జరుగుతున్నాయన్నారు. దాతల కోసం చూస్తుండగా ఎమ్మెల్యే ఉదయభాను, వారి సోదరుడు సామినేని రవిచంద్ర ముందుకు వచ్చి దానికి అయ్యే ఖర్చు తాము భరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీనిపై టీడీపీ నాయకులు ఏదో నష్టం జరిగిపోతుందని రాద్ధాంతం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మున్సిపల్ కమిషనర్ మాటలను వక్రీకరించడమే కాకుండా ఏదో విధంగా రాజకీయం చేయాలని చూస్తూ అభివృద్ధిని అడ్డుకోవాలని చూడటం మంచి పద్ధతి కాదని తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న హఫీజున్నీసా, మహిళా కౌన్సిలర్లు

టీడీపీ హయాంలో 12 మందిపై కేసులు

గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కోదాడ రోడ్‌లో మ్యాక్స్ షోరూం పక్కన రోడ్డుకు అడ్డంగా రెండు షాపులను అక్రమంగా నిర్మించడమే కాకుండా ప్రశ్నించినందుకు 12 మంది కౌన్సిలర్లపై అక్రమంగా కేసులు పెట్టించి, మానసిక క్షోభకు గురిచేశారని ఆరోపించారు. మున్సిపల్ నిధులతో కాకుండా దాతల సహకారంతో చేపట్టినప్పటికీ ప్రస్తుత నిర్మాణంపై కౌన్సిల్‌లో చర్చించాల్సిన అవసరం లేనప్పటికీ, కౌన్సిల్‌లో పెట్టాలని అనడం వారి అమాయకత్వాన్ని తెలియజేస్తుందన్నారు. ఇకనుంచి అయినా ఇలాంటి చీప్ ట్రిక్స్ మానుకోవాలని హితవు పలికారు.

ఉత్తమ ఫలితాల సాధనలో చేతిరాత కీలకం


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉత్తమ ఫలితాల సాధనలో చేతిరాతే కీలకమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి చేతిరాతపై పట్టు సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతిరాతలో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోనున్నామని కలెక్టర్ తెలిపారు. హ్యాండ్ రైటింగ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు శనివారం ఆయన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతిరాత నిపుణుడు భువనచంద్ర సహకారంతో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు సంబంధించి ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 170 మంది విద్యార్థులు పాల్గొనగా ఉన్నత స్థాయిలో ఎస్.జీవితేష్, అవ్యక్తా, ప్రద్యుమ్నా పూజారి ప్రాథమిక స్థాయిలో జి.జ్ఞాన శ్రీనిధి లు చాంపియన్ షిప్ సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జాతీయ చేతిరాత నిపుణుడు పి.భువనచంద్ర, అమలి, శుభోదయ పాఠశాలల ప్రిన్సిపాల్స్ వై.రాజకుమారి, బి.శైలజ, అధ్యాపకులు సీహెచ్.నళిని, ఎం.శ్యామ్ కుమార్, ఎం.కె.ఎస్తేరు, పద్మజ్యోతి, ఎ.భావన, జి.జ్ఞానేశ్వరి, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కెనాల్‌రోడ్డులో రథోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరిగే మల్లేశ్వరుని రథోత్సవం నగరంలో ఆదివారం నిర్వహించనున్నారు. కేవలం నగర వాసులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలివస్తుంటారు. ఈ రథోత్సవంలో మూడు ఆలయాలకు చెందిన ఉత్సవమూర్తులు కెనాల్ రోడ్డులో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తుంటారు. దుర్గగుడి, పాత శివాలయం బుద్దువారి గుడిలకు చెందిన ఉత్సవమూర్తులను ఈ రథంపై అధిష్టింపజేస్తారు. శ్రీకన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ 153 సంవత్సరాలుగా ఈ రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వన్‌టౌన్ రహదారులన్ని జాతరను తలపించే విధంగా దుకాణాలతో దర్శనమిస్తాయి. ప్రధానంగా గ్రామాల్లో జరిగే తిరునాళ్లు, సంత వాతావరణాన్ని ఈ రథోత్సవం ఆవిష్కరిస్తుంది. ఈ ఏడాది మరింత దేదీప్యమానంగా రథోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కెనాల్‌రోడ్డులో భక్తులకు కనువిందు

దుర్గగుడి, బుద్దు వారి గుడి, పాతశివాలయానికి పూర్వం ఆర్థిక వనరులు ఉండేవి కావు. ఆ సమయంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేవారు. ఆ తరువాత ఈ మూడు ఆలయాలకు సంబంధించిన ఉత్సవ మూర్తులతో రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆ కమిటీ ప్రముఖులు చెబుతున్నారు. అయితే నేడు దుర్గగుడికి ఆదాయ వనరులు పెరగటంతో మూడున్నర దశాబ్దాలుగా దుర్గగుడి అధికారులే కొండపైన కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. పాతశివాలయంలో ఇప్పటికీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలోనే కల్యాణోత్సవాలు కొనసాగుతున్నాయి.


కనులపండువగా రథోత్సవం (ఫైల్)